4న డిఎల్‌టిసిలో జాబ్‌మేళా

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా కేంద్రంలోని డిఎల్‌టిసి కేంద్రంలో ఈ నెల 4న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు ఎస్‌బిఐ. కార్డ్స్, ఎం/ఎస్ సుస్వదీప్ ఆగ్రో సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు హాజరై నిరుద్యోగులకు మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఎస్‌బిఐ కార్డ్డు కంపెనీలో 30 ఖాళీలున్న బ్రాంచ్ రేలేషన్ షిప్ మేనేజర్ నెలకు జీతం రూ.16 వేల నుంచి రూ.25 వేలు వరకు ఉంటుందని అన్నారు. డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 18 నుంచి 35 సంవత్సరాల వయసు ఉన్న స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులలన్నారు. కెఎస్‌బిఐ కార్డ్స్ కంపెనీలో 20 ఖాళీలున్నాయని, టెలి కాలర్స్, బకెండ్సపోర్ట్ టీం, ఎం/ఎస్ సుస్వదీప్ ఆగ్రో సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలో 10 సేల్స్ ఎగ్జిక్యుటివ్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఇతర ఉద్యోగ నియామకాలకూ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

ప్రజా రక్షణ కోసం...

- జీడి రైతుకు కేంద్రం ద్రోహం
- సమస్యలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- ప్రజలను చైతన్య పరిచేందుకు సిద్ధమైన సిపిఎం
- నేటి నుంచి జిల్లాలో రెండు రోజుల పాటు బస్సు యాత్ర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో అన్ని తరగతుల ప్రజలూ ఇబ్బందులు పడుతున్నారు. పెరుగుతున్న ధరలను అదుపు చేయడంలో రెండు ప్రభుత్వాలూ విఫలమయాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలి కొదిలేసి ప్రజలను వంచిస్తున్నాయి. ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న స్టీల్ ప్లాంట్‌ను అమ్మేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తుంటే... రాష్ట్రానికి చెందిన వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కనీసం నోరు మెదపడం లేదు. కేంద్ర ప్రభుత్వం జీడి పిక్కల దిగుమతుల సుంకాన్ని ఐదు నుంచి 2.5 శాతానికి తగ్గించి రైతులను నష్టపరుస్తున్నా... మూడు పార్టీలూ మాట్లాడటం లేదు. ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలు, హామీల విస్మరణ వంటి అంశాలను వివరించడంతో పాటు ప్రజల ముందు కొన్ని ప్రత్యామ్నయాలు ఉంచాలని నిర్ణయించింది. అందులో భాగంగా లౌకిక వాదం, ప్రజా స్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం నినాదాలతో ప్రజారక్షణ భేరి యాత్రకు పూనుకుంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో జలవనరుల పుష్కలంగా ఉన్న వాటిని పూర్తి స్థాయిలో వినియోగించలేని పరిస్థితి నెలకొంది. వంశధార ఫేజ్-2, స్టేజ్-2 ప్రాజెక్టు ఆఫ్‌షోర్ రిజర్వాయర్ల నిర్మాణాలు ఏళ్ల తరబడి సాగుతున్నాయి. ఆయకట్టు స్థిరీకరణ, అదనపు ఆయకట్టు నీరు ఇవ్వాలన్న లక్ష్యం నెరవేరడం లేదు. వంశధార ఫేజ్-2 స్టేజ్-2 నిర్మాణాన్ని 2006లో రూ.935 కోట్లతో ప్రారంభించారు. ఇప్పుడు దాని అంచనా వ్యయం రూ.2048 కోట్లకు పెరిగింది. అంచనా వ్యయం పెరిగినా అదనంగా ఒక ఎకరా ఆయకట్టు మాత్రం పెరగలేదు. ప్రాజెక్టుకు సంబంధించి 87 ప్యాకేజీ పనులు 90 శాతం, 88 ప్యాకేజీ పనులు 94 శాతం జరిగాయి. హిరమండలం రిజర్వాయరు పనులు 95 శాతం పూర్తయ్యాయి. పనుల ఒప్పందాన్ని వచ్చే ఏడాది జూన్‌కు పొడిగించారు. ఆఫ్‌షోర్ పరిస్థితి అలానే ఉంది. 2007లో రూ.127 కోట్లతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం ప్రస్తుతం రూ.852 కోట్లకు చేరింది. పనులు మాత్రం 45 శాతమే జరిగాయి.

జీడి మద్దతు ధర కోసం నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్)

అపరిష్కృతంగా ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు

ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. పలాస మండలంలోని రేగులపాడు వద్ద నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్మాణ పనులతో పలాస మండలం రేగులపాడు, నందిగాం మండలం శారదాపురం, చిన్నగురువూరు, మెళియాపుట్టి మండలం చీపురుపల్లి గ్రామాల ప్రజలకు రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం కేటాయించింది. 250 ప్లాట్లు ఏర్పాటు చేసి నిర్వాసితులకు అప్పగించారు. ప్రస్తుతం శారదాపురంలోని 109 కుటుంబాలు, చిన్నగురువూరులోని 34 కుటుంబాలు, రేగులపాడులో 40 కుటుంబాలు, చీపురుపల్లిలోని 64 కుటుంబాలు కాలనీకి వచ్చేందుకు ముందుకొచ్చాయి. సిసి రోడ్లు, తాగునీటి సౌకర్యం వంటి మౌలిక సౌకర్యాలను పూర్తిస్థాయిలో కల్పించలేదు. మౌలిక వసతులకు రూ.42.89 కోట్లను కేటాయించాల్సి ఉండగా రూ.6.6 కోట్లను కేటాయించింది.

జీడి రైతులను దగా చేస్తున్న పాలకులు

జీడి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేస్తున్నాయి. విదేశీ జీడి పిక్కల దిగుమతులపై సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం ఐదు నుంచి 2.5 శాతానికి తగ్గించడంతో విదేశాల నుంచి జీడి పిక్కలు వెల్లువలా వచ్చి పడుతున్నాయి. దీంతో ఇక్కడి పిక్కలకు డిమాండ్ తగ్గింది. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన జీడి పంటకు మద్దతు ధర ప్రకటించకుండా, కొనుగోళ్లు చేయకుండా దళారుల దయాదాక్షిణ్యానికి వదిలేస్తోంది. ఏప్రిల్ రెండో వారం వరకు 80 కేజీల బస్తాకు రూ.10,500 వరకు చెల్లించారు. పంట చేతికి రావడం, రైతుల వద్ద పుష్కలంగా పిక్కలు ఉండటంతో క్రమేణా ధర తగ్గిస్తూ రూ.8 వేలే చేతిలో పెట్టారు. మద్దతు ధర ప్రకటిస్తాం, ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం తరుపున మత్స్య, పశు సంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మూడేళ్లుగా ప్రకటిస్తూ రైతులను వంచిస్తున్నారు.

మందస ప్రాంతంపై పాలకుల నిర్లక్ష్యం

ప్రభుత్వాలు మారుతున్నా మందస ప్రాంతంపై పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. మందస మండలం దేవుపురం వద్ద రాయికిల్లోయిగెడ్డకు అడ్డంగా కొత్త చిన్న నీటి పారుదల చెరువు నిర్మించి 860 ఎకరాలకు నీరు ఇచ్చేందుకు 2007 నవంబరులో రూ.4.37 కోట్లను కేటాయించారు. ఇప్పటివరకు దీనికి అతీగతీ లేకుండాపోయింది. వీటితో పాటు కళింగదల్ ఎడమ ప్రధాన కాలువమీద జగదేవ బట్టి చీపిగెడ్డ వద్ద అక్కిడెక్ట్, జంతిగెడ్డకు అడ్డంగా కొత్త చెరువు నిర్మాణమూ అటకెక్కింది. అధికార పార్టీ నాయకులు, అధికారులు కుమ్మక్కై, గిరిజనుల భూములను ఆక్రమించుకున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీటితో పాటు గిరిజన ప్రాంతాల్లో ఒడిశాతో సరిహద్దు సమస్య ఉన్నా వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంపై గిరిజనుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజా రక్షణ భేరి యాత్ర షెడ్యూల్ ఇలా

ప్రజా రక్షణ భేరి పేరిట సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన బస్సు యాత్ర జిల్లాలో రెండు రోజులు పాటు కొనసాగనుంది. తొలుత మందసలో గురవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా మందస బస్టాండ్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నారు. సభకు ముఖ్య అతిథిగా సిపిఎం అఖిల భారత నాయకులు విజూ క్రిష్ణన్ పాల్గొనున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, బి.తులసీదాస్, కె.లోకనాథం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.వి.నాగేశ్వరరావు, కె.ధనలక్ష్మి పాల్గొని మాట్లాడనున్నారు. అనంతరం అక్కడ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు కాశీబుగ్గ బస్టాండ్‌కు చేరుకోనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు టెక్కలి, సాయంత్రం నాలుగు గంటలకు కోటబొమ్మాళి చేరుకుంటారు. సాయంత్రం ఆరు గంటలకు శ్రీకాకుళం చేరుకుని ఏడు రోడ్ల కూడలి వద్ద నిర్వహించనున్న సభలో ప్రసంగించనున్నారు. మరుసటి రోజు ఉదయం తొమ్మిది గంటలకు చిలకపాలెం కూడలిలో బహిరంగ సభలో మాట్లాడనున్నారు. తర్వాత విజయనగరం చేరుకోనున్నారు.

కరువు కనిపించదా?

- వేలాది ఎకరాల్లో ఎండిపోయిన వరి
- వర్షాభావ పరిస్థితుల్లో 59 వేల ఎకరాల్లో పంటలు వేయని రైతులు
- జాబితాలో జిల్లాకు దక్కని చోటు

నందిగాం మండలం బోరుభద్రలో వరి చేనులో ఆవులను మేతకు వదిలేసిన రైతు

జిల్లాలో ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూలైలో కొంతవరకు వర్షాలు పడినా ఆగస్టు, సెప్టెంబరులో నెలల్లో అనుకున్న మేర వానలు పడలేదు. దీంతో వేలాది ఎకరాల్లో పంటలు వేయలేకపోయారు. పంటలు వేసినా ఆ తర్వాత వర్షాలు లేక ఎండిపోతున్నాయి. అక్టోబరు నెలలో కనీసం చినుకు చుక్క కూడా రాల్లేదు. దీంతో జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో కరువు ఛాయలు అలముకున్నాయి. నిబంధనల పేరిట కరువు పరిస్థితులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడంతో జిల్లా రైతాంగానికి తీవ్ర అన్యాయం వాటిల్లింది. ప్రభుత్వం బుధవారం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో జిల్లాను చేర్చకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఖరీఫ్ ప్రారంభం నుంచి వెంటాడిన వర్షాభావ పరిస్థితులు చివరి దాకా సాగాయి. సీజన్‌లో కురవాల్సిన స్థాయిలో వర్షం పడలేదు. తొమ్మిది మండలాల్లో కరువు ఛాయలు అలముకున్నాయి. పలాస డివిజన్‌లోని ఆరు మండలాలు తీవ్ర వర్షపాతం లోటు జాబితాలో ఉన్నాయి. వర్షపాతం ఫలితంగా ఈ సంవత్సరం అనుకున్న స్థాయిలో పంటల సాగు జరగలేదు. రాగులు, పెసలు, గోగు వంటి పంటల సాగు నాలుగో వంతు కూడా రైతులు వేయలేకపోయారు. నువ్వు పంటను ఒక్క ఎకరాలోనూ విత్తనాలు పడలేదు.

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో అన్ని రకాల పంటలు కలిపి 4 లక్షల 37 వేల 165 ఎకరాల సాగు లక్ష్యంగా నిర్ధేశించుకోగా, 3,81,833 ఎకరాల్లో (87 శాతం) పంటలు వేశారు. వరి పంటను 3,98,750 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు, 3,39,588 ఎకరాల్లో (85శాతం) సాగైంది. మొక్కజొన్న పంటను ఈ సంవత్సరం 26,375 ఎకరాల విస్తీర్ణం వేయాలని అనుకోగా, 23,633 ఎకరాల్లో (90శాతం) వేశారు. పత్తి పంటను 4620 ఎకరాల్లో వేయాలను కోగా, 2,763 (60శాతం) మేర వేశారు. చెరుకు పంటను 4,550 ఎకరాల మేర వేస్తారని అంచనా వేయగా, 1470 ఎకరాలు (32 శాతం) మేర వేశారు. కందులు 335 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా నిర్ధేశించుకోగా ఇప్పటివరకు 93 ఎకరాలు (28 శాతం) మేర సాగవుతోంది. వేరుశెనగ 1333 ఎకరాల మేర సాగు లక్ష్యం కాగా, ప్రస్తుతం 328 ఎకరాల్లో (25శాతం) వేశారు. మినుములు 273 ఎకరాల్లో రైతులు విత్తనాలు వేస్తారని అంచనా వేయగా, ఇప్పటి వరకు 70 ఎకరాల్లో (26 శాతం) వేశారు. ఈ సంవత్సరం 165 ఎకరాల్లో సజ్జలు వేయాల్సి ఉండగా, 58 ఎకరాలు (35శాతం) వేశారు. నువ్వు పంటను 98 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, ఒక ఎకరాలోనూ వేయలేదు.

పలు రకాల పంటలు 20 శాతంలోపే...

ప్రస్తుత ఖరీఫ్‌లో 253 ఎకరాల్లో పెసలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించగా, 20 ఎకరాలు (11 శాతం), రాగులు 145 ఎకరాల్లో రైతులు వేస్తారని అంచనా వేయగా, 20 ఎకరాల్లో (14 శాతం) వేశారు. గోగు పంటను ఈ సంవత్సరం 258 ఎకరాల్లో వేయాలని లక్ష్యంగా తీసుకోగా, 48 ఎకరాల్లో (18శాతం) వేశారు.

ఏడు మండలాల్లో కరువు ఛాయలు

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాధారణంగా 696.44 మి.మీ నమోదయ్యే పరిస్థితి ఉండగా, 699.27 మి.మీ వర్షం కురిసింది. జిల్లాలో 0.41 శాతం అదనంగా వర్షం కురిసినా, జిల్లా అంతటా ఆ పరిస్థితి లేదు. జిల్లాలో ఏడు మండలాల్లో తీవ్ర వర్షపాతం లోటు ఉంది. వాటిలో కవిటి (35.5 శాతం), కంచిలి (34.5శాతం), ఇచ్ఛాపురం (34శాతం), సోంపేట (31.3శాతం), టెక్కలి (24.5శాతం), వజ్రపుకొత్తూరు (23.5శాతం), మందస (14.5శాతం) మండలాల్లో కరువు ఛాయలు అలముకున్నాయి. జిల్లాలో ఈ పరిస్థితి ఉన్నా... ఒక్క మండలం కూడా కరువు జాబితాలో చోటు కల్పించలేదు.

నిబంధనల పేరిట రైతులకు అన్యాయం

వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు 59, 162 ఎకరాల్లో వరి పంట వేయలేదు. అధికారుల లెక్కల ప్రకారం మరో 15 వేల ఎకరాల్లో పంట ఎండిపోయిందని చెప్తున్నారు. మొత్తం మీద 74 వేల ఎకరాల వరకు రైతులు నష్టపోయారు. కరువు జాబితా ప్రకటనకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. పంటల సాగు 70 శాతం కంటే తక్కువ ఉండటం, నీటి లభ్యత, భూగర్భ జలాలు, వలసలు వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని జిల్లా యూనిట్‌గా లెక్కలు తీసుకోవడంతో 70 శాతం కంటే తక్కువ ఉన్న మండలాలుకూ జాబితాలో చోటు దక్కలేదు. కరువు నిబంధనల్లో పేర్కొన్న అంశాలకనుగుణంగా జిల్లాలో పరిస్థితులు ఉంటేనే ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం సూచించడంతో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు కనీసం ప్రతిపాదనలూ పంపలేదు. మొత్తం మీద జిల్లాలో కరువు పరిస్థితులు ఉన్నా జాబితాలో చోటు కల్పించకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హామీలన్నీ అమలు చేశాం

రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

మాట్లాడుతున్న మంత్రి ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదేనని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార మండలం వాడాడలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యున్నతమైన పాలన సాగుతుందన్నారు. ఆర్థిక, సామాజిక రంగాలలో అభివృద్ధి చెందేందుకు చదువు ఒక్కటే మార్గమని ప్రభుత్వం నమ్ముతుందన్నారు. అందుకోసమే విద్యారంగానికి పెద్ద ఎత్తున నిధులు ప్రభుత్వం కేటాయిస్తుందని పేర్కొన్నారు. ప్రతిపక్షాల మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో జగన్ నిరూపించారన్నారు. అవినీతి అనేది రాష్ట్రంలో ఎక్కడా లేదన్నారు. జగన్ పిచ్చోడు అని లోకేష్ అంటున్నారని.. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకుని వచ్చి దనవంతుల పిల్లల్లా పేద పిల్లలకు మంచి విద్యను అందిస్తుంటే జగన్ పిచ్చోడా? మీరే పిచ్చోళ్లు అని అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు, గార ఎంపిపి గొండు రఘురాం, పీస గోపి, గొండు కృష్ణమూర్తి, సురేష్, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్, నాటక అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, మార్పు పథ్వీ, వైస్ ఎంపిపి అరవల రామకృష్ణ పాల్గొన్నారు.

రిమాండ్ ఖైదీల కేసుల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ముద్దాయిల కేసులు సత్వర పరిష్కారానికి పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు వ్యక్తిగత శ్రద్ధ పెట్టాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశించారు. కోర్టు ప్రాంగణంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అండర్ ట్రయల్ ప్రిజనేర్స్ రివ్యూ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జైల్లో ఉన్న ముద్దాయిల కేసులు విషయంలో పోలీసులు త్వరిత గతిన ఛార్జీషీటు వేయాలన్నారు. దీర్ఘకాలంగా ఈ కేసులు పెండింగ్ ఉంచడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తులు శ్రీదేవి,

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

భాస్కరరావు, ఫణికుమార్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, మెజిస్ట్రేట్లు శారదాంబ, శ్రీవిద్య, భరణి, డిఆర్ఒ గణపతిరావు, అదనపు ఎస్‌పి తిప్పేస్వామి, జిల్లా జైలు సూపరింటెండెంట్ నబిఖాన్ , డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ మెట్ట మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల వినతుల పరిశీలన

డిఆర్‌ఒ గణపతిరావు

మాట్లాడుతున్న డిఆర్‌ఒ గణపతిరావు

శ్రీకాకుళం అర్బన్ : గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల విజ్ఞప్తులను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అన్నారు. ప్రతివారమూ నిర్వహించనున్న రాజకీయ పార్టీల సమీక్ష సమావేశంలో భాగంగా 16వ వారపు సమావేశాన్ని బుధవారం తన ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత్ ఎలక్ట్రికల్ లిమిటెడ్ ఇంజినీర్ల పర్యవేక్షణలో జరుగుతున్న బ్యాలెట్ యూనిట్లు, వివి పాట్లు, కంట్రోల్ యూనిట్ల ముదింపు ప్రక్రియను గురించి వివరించారు. దాదాపు 70 శాతానికి పైగా వాటి పనితీరును పరిశీలించామని, రెండు మూడు శాతం పరికరాలు సాంకేతికంగా విఫలమైనట్లు గుర్తించామని అన్నారు. వాటిని ప్రక్రియ నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లాకు చేరిన కొత్త పరికరాలతో పాటు మిగిలిన వాటినీ గడువులోగా పరిశీలిస్తామని చెప్పారు. ఈ నెలలో బూత్ లెవెల్ స్థాయిలో జరగనున్న ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను గురించి చెప్పారు. ఇప్పటికే జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 27 వేల క్లెయిమ్‌ల పరిష్కారానికి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ సూచనల మేరకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ నెల 4,5, డిసెంబరు 2, 3 తేదీల్లో ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులతో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని దృష్ట్యా ఆయా కేంద్రాల్లో ఎన్నికల విధులకు సంబంధించిన అధికారుల ఫోన్ నంబర్లతో కూడిన జాబితాను స్పష్టంగా కనిపించేలా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రౌతు శంకరరావు, టిడిపి నాయకులు పి.ఎం.జె.బాబు, బిజెపి చల్లా వెంకటేశ్వరరావు, బిఎస్‌పి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపితోనే సామాజిక న్యాయం

ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ

మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపితోనే సామాజిక న్యాయం అందుతుందని ఉత్తరాంధ్ర వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ అన్నారు. పట్టణ శివారున కొర్లకోట రోడ్‌లో ఉన్న శ్రీనివాస కళ్యాణ మండపంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సామాజిక సాధికారత బస్సు యాత్ర సన్నాహక సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 7న ఆమదాలవలసలో నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆమదాలవలస బహిరంగ కూడలిలో బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 9 నుంచి రాష్ట్రంలోని అన్ని సచివాలయాల కేంద్రాల్లో 'జగన్ ఎందుకు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తునట్లు వెల్లడించారు. ఆ సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు, లబ్ధిపొందిన లబ్ధిదారుల వివరాలతో బోర్డులను ప్రదర్శించాలన్నారు. నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంపిపిలు, ఎంపటిసిలు, సర్పంచ్‌లు సమావేశమై సభను నిర్వహించి ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఆయా గ్రామంల్లో జండా దిమ్మకట్టి వైసిపి జెండాను ఎగురువేయాలన్నారు. అలాగే ప్రభుత్వాలు, వ్యక్తులు మాజీ సిఎం చంద్రబాబును అరెస్టు చేయలేదని, న్యాయస్థానం రిమాండ్ విధించిందని అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, నియోజకవర్గ పరిశీలకులు ఇందుకూరి రఘురామరాజు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, డోల జగన్, యువజన విభాగ ప్రధాన రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, నాలుగు మండలాల జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అయ్య వారి సేవలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది

సుబ్బి పెళ్లి వెంకి చావుకు వచ్చిందన్నట్టు పురపాలక సంఘ సిబ్బంది తీరు ఉన్నదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పన్నుల రూపంలో వచ్చిన డబ్బులతో జీతాలు తీసుకుంటూ ఉద్యోగాలు వెలగ పెడుతున్న కొంతమంది సిబ్బంది రాజకీయ నాయకుల సేవలకు అంకితం కావడం పలు విమర్శలకు తావిస్తోంది. ఉద్యోగుల సేవలు ప్రజల చెంతకు చేరడం లేదని పలువురు వాపోతున్నారు. కొర్లకోట రోడ్డులోని శ్రీనివాస కళ్యాణ మండపంలో సామాజిక సాధికారత బస్సు యాత్ర సన్నాహక సమావేశానికి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, స్పీకర్ తమ్మినేని సీతారాం, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. పార్టీ సమావేశానికి మున్సిపాలిటీకి చెందిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉదయం ఎనిమిది నుంచి కళ్యాణ మండపంలో కుర్చీలు వేయడం దగ్గర నుంచి తాగునీరు, టీలు డ్రింకులు, బిస్కెట్లు వంటి సేవలన్నీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే నిర్వహించారు. ఇది చూసిన పలువురు నివ్వెర పోవడం వారివంతయ్యింది. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్‌ను వివరణ కోరగా, మంత్రులు వస్తున్న సందర్భంగా పరిసరాలు పరిశుభ్రం చేయడానికి మాత్రమే సిబ్బందిని పంపించామని,కళ్యాణ మండపంలో చేపట్టిన పనులు తన దృష్టికి రాలేదని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

పొట్టిశ్రీరాములు త్యాగం మరువలేనిది

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అమరజీవి పొట్టిశ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అక్కడ నుంచి అధికారులతో కలసి పాత బస్టాండ్ కూడలికి చేరుకుని అక్కడ పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేయాలని పొట్టిశ్రీరాములు రెండు నెలల పాటు ఉపవాస ఉంటూ దీక్ష చేశారని అన్నారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం భాషా ప్రయుక్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించిందన్నారు. ఆయన చేసిన ప్రాణ త్యాగం వల్ల ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆయన త్యాగాన్ని స్మరించుకునే విధంగా నెల్లూరు జిల్లాకు పొట్టిశ్రీరాములు పేరును పెట్టారని గుర్తు చేశారు. త్యాగధనుల స్ఫూర్తితో అధికారులు ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుదామన్నారు. ఆయన త్యాగాలను మరువలేనివని, ఆయన ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరవు, జిల్లా ఖజానాశాఖ అధికారి రవికుమార్, కలెక్టరేట్ ఎఒ రాజేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు పాల్గొన్నారు.

అంతు 'చిక్కని' పెద్దపులి

- వారం రోజులుగా సంచారం
- దాడిలో ఆవులు, గేదె, పెయ్యి మృతి

ప్రజాశక్తి- కవిటి, కంచిలి

వారం రోజులుగా కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల్లో ప్రశాంతంగా సంచరించిన పెద్దపులి బుధవారం ఒక్కసారిగా పంజా విసిరిసింది. కవిటి మండలం సహలాలపుట్టుగ పంచాయతీ లండారిపుట్టుగకు చెందిన మామిడి కొయిరయ్య అనే రైతు ఆవు దూడ, కొండిపుట్టుగకు చెందిన నర్తు పాపయ్య గేదె పెయ్యి పులిదాడిలో చనిపోగా, కొండిపుట్టుగకు చెందిన కొర్రాయి నూకయ్య గేదె, పెయ్యి, మురిపాల ఢిల్లీరావు ఆవు దూడ తీవ్రంగా గాయపడ్డాయి. దీంతో ఉద్దానం వాసులు ఉలిక్కిపడ్డారు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో విశాఖ నుంచి వస్తున్న కెవిఆర్ బస్సుకు మండలంలోని నెలవంక సమీపంలో పులి ఎదురు పడడంతో అతను స్థానికులకు ఫోన్ చేసి అప్రమత్తం చేశాడు. తెల్లవారు జామున లేచి చూసేసరికి మండలంలోని గుజ్జుపుట్టుగ, కొండిపుట్టుగ, లండారిపుట్టుగ గ్రామాల్లో పశువులపై దాడి చేయడం అందులో రెండు చనిపోయాయి.

కవిటి : చనిపోయిన దూడను పరిశీలిస్తున్న అధికారులు

కంచిలి మండలం మండలంలోని మండపల్లికు చెందిన మాదిన శ్రీనివాసరావు అనే రైతుకు చెందిన ఆవు మంగళవారం అర్ధరాత్రి పులి దాడికి గురై మృతి చెందింది. శ్రీనివాసరావు ఇంటి సమీపంలో ఎప్పటిలాగే ఆవులను కట్టి ఉంచారు. బుధవారం ఉదయం నాలుగు గంటలకు వెళ్లి చూసేసరికి ఒక ఆవు కనిపించకుండ పోయేసరికి పరిసరాల్లో వెతికి చూస్తే... తీవ్ర గాయాలతో ఆవు మృతి చెందినట్లు గుర్తించారు. ఈ సమాచం తెలుసుకున్న ఆర్‌డిఒ భరత్ నాయక్, ఫారెస్టు రేంజ్ అధికారి మురళీకృష్ణ నాయుడు, తహశీల్దార్ హైమావతి, అటవీ శాఖ సిబ్బంది సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలన చేశారు. అనంతరం పశు వైద్యాధికారి శిరీష పోస్టుమార్టం నిర్వహించారు. అలాగే సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బెండాళం అశోక్, ఎంపిపిలు దేవదాస్‌రెడ్డి, డాక్టర్ దాసు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. పరిశీలనలో డిఆర్ఒఐ రాము, బారువ సెక్షన్ ఆఫీసర్ రాజేంద్ర పాల్గొన్నారు.

అటవీ శాఖ తీరుపై అసంతృప్తి

ఇటువంటి పరిస్థితుల్లో అటవీ శాఖ సిబ్బంది పాత్ర కేవలం అడుగులు అంచనా వేయడానికే పరిమితవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే రోజూ ఏదో ఓ గ్రామంలో స్థానికులు పులి అడుగులు చూసి అటవీ సిబ్బందికి చెప్పడం, సిబ్బంది వచ్చి పౌడర్ చల్లి ఇది అదే అని చెపుతున్నారు. కానీ, అంతకుమించి పురోగతి కనిపించడం లేదు. వారం రోజులుగా మూడు మండలాల్లో పులి సంచరిస్తున్నా ఎక్కడా కెమెరా ట్రాప్‌లు కానీ, పులి బోనులు కానీ ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు పూర్తిస్థాయిలో దానిపై నిఘా వేసి కెమెరా ట్రాప్‌లు, పులి బోనులు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఉన్న ఈ ప్రాంతం లో అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ పులి బారినుంచి ప్రజలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

కంచిలి : ఆవుకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశువైద్య సిబ్బంది

SRIKAKULAM MUNICIPAL CORPORATION

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2023-2024 కార్యక్రమంలో భాగముగా గార్బేజ్ ఫ్రీ సిటీ (GFC), ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ (ODF) మరియు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ సంబంధించిన రిపోర్టింగ్, డాక్యుమెంటరీ, మొదలగు పనులకు ఈ నగరపాలక సంస్థ కార్యాలయలమునకు తాత్కాలిక ప్రాతిపదికన పని చేయుటకు అనుభవం కలిగిన ఏజెన్సీల నుండి కొటేషన్లు స్వీకరించబడును. ఎంపిక కాబడిన ఏజెన్సీకి (ఒక నెలకు రూ.37,000/- చొప్పున చెల్లించబడును. ఆశక్తి గల ఏజెన్సీ వారు తేది: 08.11.2023 కొటేషన్లు సమర్పించవలసినదిగా కోరడమైనది.

గమనిక: ఏజెన్సీ తరుపున కనీసం ఇద్దరు అభ్యర్థులు ఉండవలెను.

ఇతర వివరముల కొరకు ఈ ఆఫీస్ పని చేయు వేళలలో సంప్రదించగలరు

Cont. No. 9849906972, 8790845205.

Commissioner
Srikakulam Municipal Corporation

విస్తరణ పనులను పరిశీలిస్తున్న మంత్రి అప్పలరాజు

కెటి రోడ్ పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- పలాస

పలాస కెటిరోడ్డు పనులు శరవేగంగా చేపట్టి తొందరలో పూర్తి చేయాలని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గుత్తేదారుడు మెదలవలస మస్తధరావుకు ఆదేశించారు. కెటిరోడ్ విస్తరణ పనులను చివరిదశకు చేరుకొని తారురోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్న నేపథ్యంలో పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు. నిర్మాణ పనులకు ఎటువంటి అడ్డంకులు ఉన్నా వాటిని తక్షణం తొలగించి శరవేగంగా పనులు చేపట్టాలన్నారు. ఈయనతో పాటు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు సునీల్ కుమార్, ఎఇ అవినాష్ ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అప్పలరాజు

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డు సీతారామనగర్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, అట్టడుగు ప్రజల అభ్యున్నతి కృషి చేసిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు. ఎన్నో సంస్కరణలు చేపట్టడంతో నేడు అంబేద్కర్ ఆదర్శవాదిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, బోర కుజ్జి, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

8న విద్యాసంస్థల బంద్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించాలని అనే విద్యార్థి యువజన సంఘాల, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 8న జరిగే బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ మండల నాయకులు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట మధుసూదనరావు, జనసేన నాయకులు అవినాష్ అన్నారు. బుధవారం టెక్కలిలో మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని, ఉద్యమాలతో, బలిదానాలతో విశాఖ ఉక్కు పరిశ్రమను సాధించుకోవడం జరిగిందని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు ఊడిగం చేసేలా ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను చేసేందుకు ఎత్తుగడలను మానుకోవాలని హితవు పలికారు. కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నామని ప్రతిఒక్కరు బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

'ఐతమ్' అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కామేశ్వరరావు

టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న పేడాద కామేశ్వరరావుకు ఆంధ్రా యూనివర్సిటీ ఇనిస్టిట్యూట్ టెక్నాలజీలో పిహెచ్‌డి పట్టాను మంజూరు చేసింది. ఆ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయు ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ ఎన్నెపు భుజంగరావు మార్గదర్శకత్వంలో "సెగ్మెంటేషన్ ఆఫ్ బ్రెయిన్ ట్యూమర్ ఇన్ కాంట్రాస్ట్ ఎన్హేన్స్‌డ్ ఎంఆర్ అండ్ సిటి ఇమేజెస్ యూజింగ్ డీప్ లెర్నింగ్" అనే అంశంపై చేసిన పరిశోధనకు ఈ పిహెచ్‌డి పట్టాను ఆంధ్రా యూనివర్సిటీ జారీ చేసిందన్నారు. డాక్టర్ కామేశ్వరరావు పిహెచ్‌డి పట్టా సాధించడంపై డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీని వాసరావు, అకడమిక్ డీన్ డాక్టర్ డి.ఆజాద్, హెచ్‌ఒడి డాక్టర్ రామారావుతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

శిక్షకులకు సన్మానిస్తున్న కౌన్సిలర్ జోగారావు

గురువులకు సన్మానం

ప్రజాశక్తి- పలాస

షెటిల్ బ్యాట్మింటన్ క్రీడలో శిక్షణ ఇచ్చి ఎంతో మందిని ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దిన గురువులు, కోచ్‌లకు సన్మానించారు. సీనియర్ షెటిల్ బ్యాట్మింటిన్ క్రీడాకారుడు చల్లా రమేష్ కుమారుడు చల్లా రేవంత్ అండర్-17 బాలుర విభాగంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యానాంకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా చల్లా రేవంత్ ఎంపిక కావడానికి కృషి చేసి శిక్షణలలో ఎన్నో మెలుకువలు నేర్పించి రేవంత్ విజయానికి కారుకులైన శిక్షకులు ఎం.మల్లిఖార్జునరావు(మలి), షేక్మహ్మద్(మున్నా)లకు స్థానిక రైల్వే ఇన్స్టిట్యూట్‌లో కౌన్సిలర్ గుజ్జు జోగారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైల్వే ఇన్స్టిట్యూట్ కార్యదర్శి రెడ్డి, చల్లా రమేష్, కిరణ్ కుమార్, పిడి తవిటయ్య, సోము. మాధవ్, శ్రీకాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్ పేరుతో హత్యలు

పలాస : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోసం ఉద్యమాలు చేస్తున్న వారిపై బూటకపు ఎన్ కౌంటర్ పేరుతో హత్యలు చేస్తున్నారని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు దుయ్యబట్టారు. న్యూడెమోక్రసీ కార్యాలయంలో మంగళవారం అరుణ పతాకాన్ని వంకల పాపయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళ ఉద్యమం, గోదావరిలోయ ప్రతిఘటన పోరాటంలో వేలాదిమంది అమరలయ్యారన్నారు. ఉద్యమంలో అగ్ర నాయకులు చంద్రపుల్లారెడ్డి, సత్యనారాయణ సింగ్, తరిమిల నాగిరెడ్డి వంటి అగ్ర నాయకులు అమరులయ్యారన్నారు. ఈ సభలో అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కార్యదర్శి కొసింటి సోమేశ్వరరావు, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్‌కు చంద్రబాబు భరోసా

మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

శ్రీకాకుళం అర్బన్ : ఇంటింటా ప్రచారం చేస్తున్న లక్ష్మీదేవి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర భవిష్యత్‌కు భరోసా చంద్రబాబు అని, అభివృద్ధి, సంక్షేమమే టిడిపి ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. నగరంలోని 48వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గడచిన కాలంలో చంద్రబాబు పాలనలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలను తుచ తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. ఆడబిడ్డ నిధి ద్వారా ప్రతి ఇంట్లో 19 నుంచి 59 ఏళ్ల వయసు గల మహిళలకు రూ.1500 సాయంగా అందజేస్తామన్నారు. ప్రజాదరణ చూసి ఓర్వలేక ఓటమి భయంతో వైసిపి ప్రభుత్వం చంద్రబాబును అక్రమ పద్ధతుల్లో జైల్‌లో ఉంచారని అన్నారు. ఆధారాలు లేని అక్రమ కేసు పెట్టి అరెస్టు చేసి 52 రోజుల పాటు నిర్బందించడం కక్షపూరిత చర్య అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారు ఆయనకు బాసటగా నిలిచారన్నారు. రోడ్డుపైకి వచ్చి పోరాటం చేశారన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా రాష్ట్ర భవిష్యత్‌కు టిడిపితో కలిసి పనిచేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బిసిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శిల్లా శ్రీనివాసరావు, డివిజన్ ఇన్‌ఛార్జి సురకాసి వెంకటరావు, నియోజకవర్గం బిసి సెల్ కార్యదర్శి మడ్డి అప్పలరాజు, నగర తెలుగు యువత ఉపాధ్యక్షులు శిల్లా సురేంద్ర, నగర పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, జామి భీమశంకరరావు, కరగాన భాస్కరరావు, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: టిడిపి అధికారంలోకి వస్తే ఏయే సంక్షేమ పథకాలు అందజేస్తామనేది ఇంటింటికి వెళ్ళి వివరించాలని మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, ఎంపిపి ప్రతినిధి కామమేశ్వరరావు అన్నారు. బుధవారం టిడిపి కార్యాలయంలో మండల టిడిపి నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరు వారి పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి టిడిపి అందించబోతున్న సంక్షేమ పథకాలు వివరించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నంబాళ్ల శ్రీనివాస్, గొండు లక్ష్మణరావు, సాసుమంతు ఆనందరావు, దేవాది సింహాద్రమ్మ, కోరాడ గోవిందరావు, లాడి శ్రీనివాస్, వెంకటేష్, వాన లక్ష్మి, బెండి అన్నపూర్ణ పాల్గొన్నారు.

టెక్కలి: రాష్ట్రంలో ఉన్న వైసిపి అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన ఆవసరం ఉందని టెక్కలి మండల టిడిపి ఆధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. మండలంలోని నర్సింగపల్లి పంచాయితీ పరిధి కొల్లివలస గ్రామంలో భవిష్యత్తుకి గ్యారంటీ కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి మ్యానిఫెస్టోని ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి పోలాకి షణ్ముఖరావు, రాంపురం సర్పంచ్ పినకాన జోగారావు, టిడిపి నాయకులు దారపు రాము, దల్లి ప్రసాద్‌రెడ్డి, పెదరట్టి మణి, రెయ్యి ప్రీతీష్ చంద్, దారపు జోగారావు, కోళ్ల కామేష్, మల్లిపెద్ది మదు పాల్గొన్నారు.

బూర్జ: బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం పెద్దపేట పంచాయతీ పరిధిలో నీలాపురం గ్రామంలో బిసిసెల్ మండల అధ్యక్షుడు మామిడి దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత రాష్ట్రం పేదరికంలో కూరుకుపోయిందన్నారు. ఇతర రాష్ట్రాలకు నిరుపేద కుటుంబాలు వలసల బాట పట్టాయని, ప్రతి ఒక్కరూ ఆలోచించి టిడిపి ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒకటి అమలుచేస్తుందన్నారు. కార్యక్రమంలో దాసిరెడ్డి వెంకునాయుడు, మజ్జి అప్పలనాయుడు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: పోస్టర్లను అందజేస్తున్న టిడిపి నాయకులు

కంటి ఆపరేషన్‌కు కోర్టు అనుమతిస్తే సంబరాలా?

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

చంద్రబాబుకు కంటి ఆపరేషన్ కోసం హైకోర్టు నాలుగు వారాల పాటు తాత్కాలిక బెయిల్ ఇస్తే టిడిపి నేతలు న్యాయం గెలిచిందంటూ హంగామా చేయటం హాస్యాస్పదంగా ఉందని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. బుధవారం విలేకర్లుతో మాట్లాడుతూ చంద్రబాబు కంటి ఆపరేషన్‌కోసం నాలుగు వారాలు హైకోర్టు బెయిల్ ఇచ్చిందని, నిజం, సత్యం, ధర్మం గెలిచి చంద్రబాబు బయటకు రాలేదనే విషయాన్ని టిడిపి నేతలు గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబుకు తాత్కాలిక బెయిల్ వస్తే లోకేష్ యుద్ధం మొదలైందని హెచ్చరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబుకు ఇచ్చిన షరతులతో కూడిన బెయిల్‌కే టిడిపి సంబరాలు చేసుకుంటుందని ఎద్దేవా చేశారు. ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు అలవాటు పడ్డారని, జన్మభూమి కమిటీల పాలనవైపు చూడరని ఆయన జోష్యం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కర్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, మండల విప్ బొడ్డు అప్పన్న, వైసిపి నాయకులు హనుమంతు తేజ, సింగుపురం వినోద్, రాము ఉన్నారు.

ఆమదాలవలస: కంటి సర్జరీ కోసం చంద్రబాబుకు తాత్కాలిక బెయిల్‌ను హైకోర్ట్ మంజూరు చేస్తే దానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకోవటం హాస్యాస్పదంగా ఉందని వైసిపి ప్రచార విభాగం జోనల్ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుకు హైకోర్టు కంటి ఆపరేషన్ కోసం తాత్కాలికి బెయిల్ మంజూరు చేసిందని, ఆరోగ్యం సరిగా లేదని ఎవరు కోర్టుకు విన్నవించు కున్నా వారికి కోర్టు బెయిల్ మంజూరు చేస్తుందన్నారు. చంద్రబాబు ఈ రోజు వరకు కేసులో మెరిట్స్ గురించి వాదించటం లేదని, సాంకేతిక అంశాలు మీదే వాదిస్తున్నారని ఇది పరిశీలిస్తే చంద్రబాబుకు స్కిల్ స్కామ్‌లో ముడుపులు అందాయని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు ముద్దాడ ఈశ్వరరావు, దానేటి రామ్మోహన్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

లే అవుట్లను పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని మెళియాపుట్టి, జర్రిపద్ర గ్రామాల్లో లేఅవుట్లును బుధవారం టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ పరిశీలించారు. ఇందుకు సంబంధించి భూ రికార్డులను పరిశీలించారు. ఈయనతో పాటు తహశీల్దార్ సరోజిని, ఆర్ఐ వైకుంఠరావు, విఆర్ఒలు అన్నాజీరావు, రమణ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'గౌతు' నిర్లక్ష్యమే రైతుల పాలిట శాపం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

టిడిపి హయాంలో ఎమ్మెల్యేగా పనిచేసిన గౌతు శివాజీ నిర్లక్ష్యమే వంశధార శివారు ప్రాంతం రైతులకు శాపంగా మారిందని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పూండి సామాజిక భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. శివాజీ హయాంలో అప్పటి మంత్రి కింజరాపు అచ్చంనాయుడు టెక్కలి నియోజకవర్గంలో 17 ఎత్తిపోతల పథకాలు నిర్మిస్తుంటే శివాజీ మిన్నుకుండిపోయారని అన్నారు. పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న మంత్రి అప్పలరాజును విమర్శించే స్థాయి యార్లగడ్డ శిరీషకు లేదన్నారు. వాస్తవాలు మాట్లాడి ప్రజల మన్ననలు పొందే ప్రయత్నం చేయాలే తప్ప మంత్రిని చులకన చేసి మాట్లాడితే విజ్ఞులైన ప్రజలు టిడిపి నాయకులకు సరైన బుద్ధి చెబుతారన్నారు. ఇంకొకసారి మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ గోపి, తుంగాను సుశీల, గోవిందపురం ఎంపిటిసి లోకనాథం, పాతటెక్కలి ఎంపిటిసి బాలక శ్రీను, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జల్లు ఉషారాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్

పంట పొలాలు పరిశీలన

ప్రజాశక్తి- సోంపేట

పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో మండ లంలో జీడిపు ట్టుగ, కుమ్మరిపాడు తదితర ప్రాంతాల్లో బుధవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలన చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి కె. శ్రీధర్, జిల్లా కార్యాలయ సహాయ వ్యవసాయ సంచాలకులు భవాని శంకర్, వ్యవసాయ సహాయ సంచాలకులు కె. జగన్ మోహనరావు, ఎఒబి నరసింహమూర్తితో కలిసి పైడిగాం కాలువ శివారు భూముల్లో నాట్లు వేసిన వరి పొలాలను సందర్శించారు. సుమారుగా నెలకుపైగా కాలువ పారుదల లేనందున, వర్షాభావం ఉన్నందున ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ చెరువుల్లో నీటి లభ్యత, పంటకు పెట్టుబడి వివరాలు, రైతులు తీసుకున్న పంట రుణాలు, ఈ-క్రాప్‌లో పంట నమోదు, రైతు ధ్రువీకరణ తదితర వివరాలు ఆరా తీశారు. ప్రస్తుత పంట పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. పర్యటనలో స్థానిక వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

డిసిసిబి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- పోలాకి

జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ సీతారాం సూచించారు. బుధవారం సంత లక్ష్మీపురం గ్రామంలో చైర్మన్ కరిమి రాజేశ్వరరావు ఆదేశంతో రైతులకు, పొదుపు మహిళా సంఘాల సభ్యులకు, చిరు వ్యాపారులకు బ్యాంకు అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసన్నపేట శాఖ మేనేజర్ ఇప్పిలి సీతారాం మాట్లాడుతూ తమ బ్యాంక్ అందించే సేవలపై వివరించారు. వాణిజ్య బ్యాంకులతో పోల్చితే తమ బ్యాంక్ తక్కువ వడ్డీలకే రుణ సౌకర్యం, ఆలాగే ఫిక్స్ డిపాజిట్లపై అధిక వడ్డీ చెల్లిస్తామన్నారు. అసిస్టెంట్ మేనేజర్ యోగేశ్వరి మాట్లాడుతూ చిల్లర వ్యాపారులకు ఎటువంటి పూచీకత్తు లేకుండా రూ.50 వేలు రుణ సౌకర్యం కల్పించగలమని, అన్ని రకాల డిజిటల్ లావాదేవీల సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో డిజిఎం బసవలింగం, సర్పంచ్ యారబాటి నీలవేణి రమణ, సొసైటీ సిఇఒ రాంబాబు, సొసైటీ సిబ్బంది నాగరాజు, భాస్కరరావు, పవన్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేనేజర్ సీతారాం

చివరి ఆయకట్టుకు నీరు అందించాలి

పలాస: గత నాలుగేళ్లుగా శివారు భూములకు చుక్క సాగునీరు అందించడం లేదని, సాగునీరు అందక రైతులు ప్రతి ఏడాది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జనసేన నాయకులు డాక్టర్ వి.దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. టెక్కలి డివిజన్ వంశధార ఎడమ కాలువ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంత్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయకట్టుకు సాగునీరు విడిచిపెట్టి ఆ ప్రాంత రైతులను ఆదుకోవాలని కోరారు. కాలువలకు 600 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉండగా ప్రస్తుతం వంతుల విధానంలో 50 క్యూసెక్కులకు మించి నీరు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. పంట చివరి దశలో ఉన్నందున సాగునీరు కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఒక్క తడుపుకు నీరు అందిస్తే కనీసం కొన్ని గ్రామాలకు, కొంతమంది రైతులకు మేలు చేసిన వాళ్ళం అవుతారన్నారు. వేసిన వరి పంట దెబ్బతినే ప్రమాదంలో ఉందని దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి భూములకు నీరు అందక నేల బీటలు వారడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారన్నారు. దిగువ ఆయకట్టు ప్రాంతాలకు కొంత నీటిని విడిచిపెడతానని వంశధార ఇఇ హామి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈయనతో పాటు రైతులు కీలు రాజారావు, తమ్మినేని తారకేశ్వరరావు, కీలు బాలరాజు, నర్సింగరావు, ధర్మారావు, జనసైనికులు పాల్గొన్నారు.

ఇఇతో మాట్లాడుతున్న దుర్గారావు

ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం

ప్రజాశక్తి- రణస్థలం

ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష పేద ప్రజలకు వరం వంటిదని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. బుధవారం మరువాడలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించి తద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ మార్చడమే సిఎం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమణమూర్తి, ఎఒ ధనుంజయరావు, పంచాయతీ అధికారి ప్రభాకరరావు, వైద్యులు సుమన్, గిరిబాబు, సర్పంచ్ జక్కంపూడి అచ్చిబాబు, వైసిపి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

రణస్థలం: మండలంలో తోటపల్లి పంట కాలువ ఆయకట్టు పరిధిలో కాలువ ద్వారా సాగునీరు విడుదల కాకపోవడంపై ఉత్తరాంధ్ర టిడిపి శిక్షణ శిబిరం మాజీ డైరెక్టర్, ఎచెర్ల నియోజవర్గం టిడిపి సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిధి అర్జునవలస గ్రామంలో గల తోటపల్లి పంట కాలువను సంబంధిత ఆయకట్టు రైతులతో కలిసి పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తోటపల్లి పంట కాలువ ద్వారా ఒక్కసారి కూడా సాగునీరు విడుదల చేయలేదని రైతులు అప్పలనాయుడుకి తెలిపారు. దీనిపై అప్పలనాయుడు స్పందిస్తూ మండలంలో తోటపల్లి పంట కాలువ ఆయకట్టు భూములకు సాగునీరు విడుదల చేయాలని కలెక్టర్ నిర్వహించే గ్రీవెన్స్‌లో ఎన్నోసార్లు వినతిపత్రాలను సమర్పించిన ప్రయోజనం లేకపోయిందన్నారు. సాగు నీరు సరఫరా చేయలేని పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రభుత్వం రైతులు సాగు చేపట్టిన పంటల విలువకు సమానమైన మొత్తాన్ని రైతులకు నష్టపరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆందోళన చేస్తున్న అప్పలనాయుడు, రైతులు

నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితా

మెళియాపుట్టి: ఓటర్ల జాబితాలో సవరణలు నిష్పక్ష పాతంగా నిర్వహించాలని తహశీల్దార్ సరోజిని అన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్ఒలు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాశ్విత వలసలు, తాత్కాలిక వలసలు గుర్తించాలన్నారు. మృతుల ఓట్లను తొలగించేటప్పుడు సంబంధిత కుటుంబం నుంచి మరణ ధ్రువీకరణ పత్రం లేదా గ్రామపెద్దల అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిటి శంకరరావు, ఆర్ఐ వైకుంఠరావు, కృష్ణారావు, హిమగిరి, అన్నాజీరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ సరోజిని

మాజీ వైస్ ఎంపిపి మృతి

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం మండలం వప్పంగిలో మాజీ వైస్ ఎంపిపి గొండు అసిరప్పడు (62) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్, టిడిపికి చెందిన సానివాడ సర్పంచ్ రుప్ప రమణ మూర్తి, భైరి మాజీ సర్పంచ్ ఎండ చిన్నారావు, రుప్ప భాస్కరరావు, అరసవిల్లి నర్సింగరావు, చిట్టి తవుడు, మోహనరావు పాల్గొని నివాళ్లర్పించారు.

ప్రథమ చికిత్స అందిస్తున్న మెడికల్ ఆఫీసర్ ప్రసాదరావు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- రణస్థలం

జెఆర్ పురం పోలీసుస్టేషన్ పరిధిలో రామతీర్థాలు రహదారి కొండములగాం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రణస్థలం గ్రామానికి చెందిన రామారావు తీవ్రంగా గాయపడడంతో పాటు కుడికాలు విరిగిపోయింది. వివరాల్లోకి వెళితే...రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఈప్రమాదం జరిగింది. గాయపడిన రామారావును కొండములగాం ఎంపిటిసి ప్రతినిధి రెడ్డి వాసు సిహెచ్‌సికి తీసుకుని వచ్చి జాయిన్ చేసారు. తక్షణమే స్పందించిన మెడికల్ ఆఫీసర్ ఎం.వి.ప్రసాదరావు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం తరలించారు.

ఇద్దరికి...

ప్రజాశక్తి- పొందూరు

మండలం తోలాపి గ్రామ సమీపంలో మంగళవారం ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో మండలంలోని రాపాక గ్రామానికి చెందిన బూరాడ రామినాయుడు, ఆయన భార్య చిన్నమ్మడులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనం ద్వారా శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మలకాం గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు జె.రాజశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

సర్పంచ్ చెక్ పవర్ రద్దు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలో రుంకు హనుమంతపురం పంచాయితీ సర్పంచ్ ఎన్ని మన్మధరావు చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠ్కర్ ఆదేశాలు జారీ చేశారు. పంచాయితీలోని నిధులు సర్పంచ్ ఎన్ని మన్మధరావు దుర్వినియోగం చేశారని రుంకు గ్రామానికి చెందిన లోళ్ల శ్రీనివాసరావు గతంలో జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై టెక్కలి డిఎల్‌పిఒ ఎ.వి.రమణ పంచాయితీకి వచ్చి నిధులు దుర్వినియోగంపై విచారణ జరిపారు. విచారణలో నిధులు దుర్వినియోగం జరిగనట్లు తేలడంతో సర్పంచ్ మన్మధరావు చెక్ పవర్ రద్దు చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై ఇఒపిఆర్‌డి గోపాలరావును వివరణ కోరగా ఆర్. హెచ్.పురం పంచాయతీలో నిధులు దుర్వినియోగం జరిగినందున సర్పంచ్ ఎన్ని మన్మధరావు చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఆదేశాలు మండల పరిషత్ కార్యాలయానికి అందాయని, కార్యదర్శి మల్లేశ్వరరావుకు కలెక్టర్ ఆదేశాలు అందజేశామని తెలిపారు.

రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ పావని

67 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో డొంకపర్త సచివాలయంలో బూర్జ పిహెచ్‌సి ఆధ్వర్యంలో 67 మందికి డాక్టర్ పావని వైద్యసేవలు అందించారు. గర్భిణీలకు బిపి, షుగర్, దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న శీతాకాలంలో ప్రతిఒక్కరు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఉదయం, సాయంత్రం చలి గాలిలో తిరగరాదన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎం లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిఒ రాధిక, డిఇఒ వెంకటరమణ, ఫైలట్ అసిరి నాయుడు, ఆశా వర్కర్ల రాణి రూపవతి పాల్గొన్నారు.

కొండచిలువ హల్‌చల్

ప్రజాశక్తి- పలాస

భారీ కొండచిలువ

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి నర్సిపురంలో సుమారు పది అడుగులు పొడవు గల భారీ కొండచిలువ హల్చల్ చేసింది. బుధవారం ఉదయం పొదల్లో దాగివున్న కొండ చిలువను స్థానికులు గమనించారు. అప్పటికే భారీగా ఆహారం తీసుకుని ఎటు వెళ్లలేని కొండ చిలువును చూసి స్థానికులు భయాందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు కొండచిలువను లోకేష్ అనే వ్యక్తితో పట్టించి సంచిలో వేసి పట్టణానికి దూరంగా విడిచిపెట్టారు. దీంతో ఆ ప్రాంత వాసులు ఊపిరిపీల్చుకున్నారు.

నేడు స్పీకర్ సీతారాం పర్యటన

ప్రజాశక్తి- పొందూరు

మండలం ధర్మపురం, పిల్లలవలస గ్రామాల్లో గురువారం స్పీకర్ తమ్మినేని సీతారాం పర్యటించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్ తెలిపారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా కుళాయిలకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

తకియా దర్గాలో ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం లాలపేటలో ఉన్న యూసుఫ్ తకియా మసీద్‌లో జరిగిన చందనోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ చందనోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ రామారావు రావడంతో కమిటీ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రతినిధి సంతోష, కమిటి ప్రతినిధులు అబ్దులా, జోహర్ ఖాన్, షేక్త మున్న, జాకిరు, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

మసీద్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ

అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఘనంగా విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నిజాయితీ జీవన విధానం అనే అంశంతో అవినీతి నిరోధకశాఖ ఆధ్వర్యాన నగరంలోని బుధవారం విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎసిబి డిఎస్‌పి రమణమూర్తి పాల్గొని అవినీతి లేని సమాజం అందరి బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో బలగలోని ఎసిబి కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సిఐలు భాస్కర్, హరి, ఎస్.వి.రమణ పాల్గొన్నారు.

మహిళా రైతులకు పనిముట్లు

నందిగాం: మండలం లఖిదాసుపురం గ్రామానికి చెందిన మహిళా రైతు సంఘాలకు వ్యవసాయ పనిముట్లు ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి బుధవారం అందజేశారు. మహిళా సంఘాలకు వరి కోతలకు సంబంధించి కొడవళ్లు, రైతులకు పరదాలు,(తార్పాలిన్లు) పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంగి మోహనరావు, ఎపిఎం నీలవేణి, మహిళా రైతులు, రైతులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ వేయిస్తున్న వాలంటీర్

విశాఖలో పింఛను అందజేత

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధి పురుషోత్తపురం సచివాలయానికి సంబంధించి 1వ వార్డుకు చెందిన సుగుణ, అలాగే 2వ వార్డుకు చెందిన నెయ్యిల దమయంతి నోటి క్యాన్సర్ వ్యాధితో పినాకిల్ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారు. వీరికి పురుషోత్తపురం సచివాలయానికి సంబంధించిన వాలంటీర్ కొనతాల దివాకర్ రెడ్డి విశాఖ వెళ్లి వారికి పింఛను అందించారు. దీంతో 1వవార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, ఎంఎల్‌ఓ సందీప్ రెడ్డి అభినందించారు.

ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తున్నాం

రెవెన్యూశాఖ ధర్మాన

పట్టాను అందజేస్తున్న మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇళ్లు లేని వారికి స్థలం కేటాయించి, ఇంత కాలం నిస్సహాయులుగా ఉన్నవారికి అండగా నిలిచి వారికి పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని, ఇదంతా జగన్ ప్రభుత్వం కారణంగానే సాధ్యమవుతుందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. సింగుపురం పంచాయతీకి చెందిన 40 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను తన క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేసి, సంబంధిత వర్గాలకు శుభాకాంక్షలు చెప్పారు. ఇవాళ మౌలిక సదుపాయాలు కల్పించి జగనన్న కాలనీలను పూర్తిచేసి ఇస్తున్నామని తెలిపారు. వీటిని అర్హులైన వారంతా అందుకోవాలని, అలానే స్వతంత్రం వచ్చిన తరువాత ఇన్నేళ్లకు పేదల ఇంటి కలలను సాకారం చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే చెల్లిందని, ఈ విషయాన్ని లబ్ధిదారులంతా గుర్తు పెట్టుకోవాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యజ్ఞంలా చేపడుతున్న ఇంటి నిర్మాణాల క్రమానికి ఎక్కువ నిధులు కేటాయించి, వాటి పూర్తికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని, ముఖ్యంగా పెద్ద ఎత్తున్న ప్రయివేటు భూమిని కొనుగోలు చేసిన ఘనత కూడా సిఎం వైఎస్ జగన్ నేతృత్వాన నడుస్తున్న సర్కారుకే చెల్లుతుందని అన్నారు.

ఉత్పత్తుల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాట్లాడుతున్న శాస్త్రవేత్త రమేష్ నాయక్

పట్టణంలో కృషి విజ్ఞాన కేంద్రంలో చిరుధాన్యాల్లో మేలైన పంటల యాజమాన్య పద్ధతులు, విలువ ఆధారిత ఉత్పత్తులపై మూడు రోజులు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.రమేష్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ రైతులకు చిరుధాన్యాల ప్రాముఖ్యతను తెలియజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కెవికె ద్వారా గిరిజన ప్రాంత రైతులకు చిరుధాన్యాలతో చేసిన విలువ దారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి కలిగేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానాధిపతి డాక్టర్ పి .వి .సత్యనారాయణ మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలికి చిరుధాన్యాలు వినియోగం అవసరమన్నారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ చిరుధాన్యాలు ఉపయోగించడం వలన ఆరోగ్యానికి మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కె. వెంకటరమణ, కెవికె శాస్త్రవేత్తలు నేలవేణి, బాలకృష్ణ, హరికుమార్, సునీత, కిరణ్ కుమార్, మౌనిక, శిల్ప రైతులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి- పొందూరు

మండలం లోలుగులో ఉపహార్ స్వచ్ఛంద సంస్థ ఆశ దీవెన టైలరింగ్ సెంటర్ ద్వారా 22 మంది మహిళలకు బుధవారం కుట్టుమిషన్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నేషనల్ డైరెక్టర్ డా. రంజిత్ కుమార్ మాట్లాడుతూ మహిళలు తమ జీవనోపాధికి ఈ కుట్టు మిషన్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ఏరియా మేనేజర్ బిఎం.పాల్, కో-ఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ లోపింటి అప్పారావు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టుమిషన్లను అందజేస్తున్న రంజిత్‌కుమార్

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ పరామర్శ

ప్రజాశక్తి- రణస్థలం

విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి-చినరావుపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో క్షతగాత్రులై విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జి.సిగడాం గ్రామానికి చెందిన కీర్తి రాములమ్మ, మజ్జి రమణ, మజ్జి సూర్యకాంతం, మజ్జి అమృత, మజ్జి మోక్ష, మహంతి ఆదిలక్ష్మి, మహంతి తేజశ్రీలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. ఈయనతో పాటు జి.సిగడాం మండలం ఎంపిపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, జెసిఎస్ ఇన్‌ఛార్జి దోల వెంకటరమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రతినిధి బాలి అప్పలసూరి, వైసిపి శ్రీను ఉన్నారు.

సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- కంచిలి

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సిఎం జగన్మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎంపిపి దేవదాస్ రెడ్డి అన్నారు. బుధవారం జె బైరిపురం పంచాయతీ పరిధిలోని ఘాటి ముకుందాపురం గ్రామ శ్మశాన వాటికకు వెళ్లే రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో రహదారులు, కాలువలు నిర్మాణాలతో పాటు తాగునీటి కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి సీతారాం, ఎంపిటిసి వైకుంఠరావు, లద్దు కేశవ పాత్రో, కొనపల సురేష్ పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎంపిపి దాసు

పెద్దపులి సంచారంపై అప్రమత్తం

ప్రజాశక్తి- సోంపేట

మండల పరిధిలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపిపి ఎన్.దాసు, తహశీల్దార్ సత్యనారాయణ సూచించారు. ఈ సందర్భంగా బుధవారం అటవీశాఖ అధికారులతో మాట్లాడారు. మండల పరిసర గ్రామాల్లో పెద్దపులి సంచరిస్తూ పలు పశువుల మృతికి కారణమైన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. సాయంత్రం వేళల్లో ఒంటరిగా బయటకు రాకూడదని, రాత్రి వేళల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పులి సంచారంపై ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

శ్రీకాకుళం అర్బన్ : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న సంఘ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగనిరతిని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కొనియాడారు. ఆయన క్యాంపు కార్యాలయంలో పొట్టిశ్రీములు చిత్రపటానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆయన రాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. బావితరాలకు ఆయన ఆదర్శమన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ గొండు కృష్ణమూర్తి, వైసిపి నగర అధ్యక్షులు సాధు వైకుంఠరావు, ఎంపిటిసి బగ్గు అప్పారావు, రంధి రాజారావు పాల్గొన్నారు.

నగరంలోని గాంధీపార్కు, గాంధీ మందిరంలలో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలో భాగంగా ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ సంయుక్తంగా అమరజీవి విగ్రహాలకు నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మన భాస్కరరావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు మండవిల్లి ఎస్.ఎస్.గుప్తా, కార్యదర్శి కాపుగంటి సంతోష్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పేర్ల మహేష్ పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమములో డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, కె.చిరంజీవులు, పి.భానుమతి, పి.రామమోహన్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ రామారావు, మండల వైసిపి అధ్యక్షులు పి.రాజశేఖర్ రెడ్డి, జెడ్‌పిటిసి ప్రతినిధి ఉప్పాడ రాజారెడ్డి, దీనబంధు రెడ్డి, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ప్రజా ప్రతినిధులు